# అత్తలేని కోడలు

ఆరోజు ఆదివారం. సుజాత తన గదిలో కూర్చుని చదువుకుంటోంది. ఆదివారం అసలు ఇంటిపట్టున ఉండదు. కాని పరీక్షలు దగ్గరపడుతున్నాయి. కనుక శ్రద్ధగా చదివేస్తోంది. ఇంతలో అమ్మ మాటలు చెవిన పడ్డాయి. సుజాతకు ఒక్కసారిగా ఒళ్ళు మండుకొచ్చింది. అందుకు కారణం పక్కింటి పిన్నిగారితో అమ్మ అన్నమాటలే. ఏమిటి వీళ్ళూ వీళ్ళ మాటలూ మరీనూ. అత్తలేని కోడలు ఉత్తమురాలా అని నిలదీసి అడిగితే మేము సృష్టించినది కాదు, పురాతనం నుంచి ఉన్న సామెతే అంటారు. అత్తా కోడలూ తేడా ఏమిటి? ఇద్దరూ ఆడవాళ్ళే కదా! పరస్పర అవగాహన ఉండదా? ఒక ఇంటి కొత్తకోడలు అడుగు పెట్టిందంటే ఇరుగుపొరుగు వాళ్ళు పని కట్టుకు వచ్చి కోడలు సుకుమారాన్ని అత్తగారితోను, అత్తగారి గయ్యాళితనం కోడలితోనూ రహస్యంగా ఏకరువు పెట్టేస్తారు. వాళ్ళిద్దరి మధ్య అనవసరంగా కలతలు పెంచేస్తారు. తరతరాలుగా అత్తగార్లింతే. ఏకోడల్ని ఏ అత్తగారు సుఖపెట్టింది. సక్కుబాయి మీరాబాయి అత్తగార్ల చేతిలో ఎన్ని బాధలు పడ్డారు. అదృష్టమంటే అత్తలేని కోడలిదే అని కోడళ్ళు తమ దురదృష్టానికి కుమిలిపోతే 'కోడలు వచ్చాక ఆ ఇంట ఉండే కన్న కాశీకో, కాటికో వెళ్ళడమే మేలు. కోడలంటూ అడుగుపెట్టాక తను ఎందుకు పనికిరానిదిగా, మూలపడిన చీపురులాగా, శీతాకాలంలో ఆతపత్రంలాగా, వేసవిలో కంబళి లాగా బ్రతకాల్సిందే. ఏ కోడలు అత్తగార్ని అభిమానంగా చూసుకుంది. తనేదో మహారాణి పదవి పొందగలిగిందినో, అందచందాలు, వయసు, చదువు సంధ్యలు తనకే ఉన్నాయని గర్వ పడిపోయి అత్తగారిమీద అధికృత చూపిస్తుంది. ఏమిటో తరతరాలుగా అత్తగార్ల భాగ్యం ఇంతే' అనుకుని నిట్టూర్చే అత్తగార్లు కొందరుంటారు. అలాకాక ఒకళ్ళ నొకళ్ళు అర్థం చేసుకుంటే ఒకరి భావాలను మరొకరు గౌరవించటం నేర్చుకుంటే అత్తాకోడళ్ళ మధ్య ఆరళ్ళుంటాయా? ఈ పాతకాలం సామెతలు చిత్తయిపోతాయి. ఆలోచిస్తూనే సర్రున లేచి వాళ్ళ ముందుకెళ్ళింది సుజాత.

"ఏమిటమ్మా మీరు మరీను. అత్తాకోడలూ అనేసరికి వాళ్ళమధ్య జరిగిన ప్రతి విషయం మీకో జగడంలానే కనిపిస్తుంది. అత్తగారితో కలిసున్నంత మాత్రాన కోడలి మంచితనం ఆవిరైపోతుందా ఏం? ఇలాంటి బూజు పట్టిన భావాలకు స్వస్తి చెప్పండి" సుజాత పట్టరాని ఆవేశంలో మాట్లాడేసరికి ఆ ఇద్దరికీ ఏంచేయాలో తోచలేదు ఇద్దరూ నిశ్చేష్టులైపోయారు.

"నువ్వింట్లో ఉన్నావనుకోలేదే తల్లీ" అంది సుజాత తల్లి కాస్త తేరుకుని. "మరీ అంత మాటకారితనం పనికిరాదు. ఈ బడాయి అంతా ఇపుడేనా పిల్లా? పెళ్ళై అత్తారింటికెడితే అపుడు నీకే తెలుస్తుంది. చూద్దాంలే, నీ అత్తని ఎలా పూజిస్తావో, అసలు అత్తగారితో పొరపొచ్చాలు

లేకుండా ఎలా కాపురం చేస్తావో!" అంటూ సుజాత బుగ్గ గిల్లింది శేషమ్మ. ఆ సంఘటనతో సుజాత మనస్సులో ఒక విచిత్రమైన ఆశయం మొలకెత్తింది. తను అత్తా కోడళ్ళ చరిత్ర మార్చేయాలి. ప్రపంచంలో తనకి అందరికన్నా ప్రియమైన వ్యక్తి అత్తగారే కావాలి. తనుకూడా అత్తగారినుంచి ఎనలేని అభిమానాన్ని పొందగలగాలి.

★ ★ ★

సుజాతకు పెళ్ళిచూపులు జరిగాయి. అన్ని విషయాలలోను ఆ సంబంధం అమ్మ, నాన్నలకు నచ్చింది. కాని సుజాతకు మాత్రం అసంతృప్తిగానే ఉంది. అన్ని విషయాలలోను తనకు ఆ సంబంధం నచ్చినా ఆ పెళ్ళి జరిగితే తన ఆశయం నెరవేర్చుకునే అవకాశమే ఉండదు. ఆమాటే అమ్మతో అంది. "బాగుందే? పిచ్చిదానా! అబ్బాయి నీకు నచ్చితే ఆలశ్యం ఎందుకు!" అనేసింది అమ్మ. నాన్నగారికి నచ్చ చెప్పాలని చూసింది. విషయం తెలుసుకుని చిరునవ్వు నవ్వి "మంచి ఆశయమే తల్లీ, అదే నీ అభ్యంతరమైతే ఆమాట మరిచిపో. వెంటనే ముహూర్తాలు పెట్టించేస్తాను."

సుజాత పెళ్ళి జరిగిపోయింది. తను అత్తలేని కోడలైపోయింది. సుజాత కాపురానికి వెడుతున్నపుడు కన్నీళ్ళు పెట్టుకుంది. అందరు ఆడపిల్లల్లాగా అమ్మ, నాన్నలను వదిలిపెట్టినందుకు కాదు: తను అడుగుపెట్టబోయే కొత్త వాతావరణం ఎలా ఉంటుందో అని భయంతోను కాదు. తను అత్తలేనికోడలుగా అడుగుపెట్టాల్సి వస్తోందే అని.

సుజాత వైవాహిక జీవితంలో ఉండే ఆనందం అనుభవించడంలో లీనమై పోయింది. వివాహానికి ముందు తనమనసులోని ఆశయం ఇపుడు పదే పదే అంతగా గుర్తు రావడం లేదు. హనీమూన్‌లంటూ విహారయాత్రలు చేయకపోయినా, రోజుకొక్క మధురిమలా కాలం హాయిగా దొర్లిపోతోంది. నూతన దాంపత్యం రంగుల హరివిల్లులాగా సుజాతను మురిపిస్తోంది. ఇలా రెండు మూడు నెలలు గడిచేసరికి సుజాత మనసులో మరుపు తెరల మధ్య దాగి ఉన్న ఆశయం మళ్ళీ ఆమె మనస్సును కలవరపెట్టసాగింది. అప్పుడప్పుడు ఆమెను ఏదో దిగులు ఆవహించేది.

కలకలనవ్వుతూ అలరించే తన గృహలక్ష్మి కలతపడటం ఎందుకా అని కలవరపడి "సుజీ, ఎంతో చలాకీగా ఉంటావు, కాని ఒకో అపుడు ఏదో గుర్తొచ్చిన దానిలా దిగాలు పడిపోతావు: ఏమిటి?" అని అడిగాడు మోహన్.

తన ఆశయం పతిదేవుని ముందు వ్యక్తపరిచి కన్నీళ్ళు పెట్టుకుంది సుజాత. మోహన్ నవ్వు ఆపుకోలేకపోయాడు. "అందరూ అత్తగార్లు ఉన్నందుకు బాధపడితే నీ తీరు తమాషాగా ఉందే" అని పగలబడి నవ్వుతూ అన్నాడు.

"మీకంతా ఎగతాళిగానే ఉంటుంది నా మనస్సు కోరిన కోరిక. తీరని బాధ ఎలా ఉంటుందో మీకేం తెలుస్తుంది?" అంది.

తన మనస్సులో బాధ ఆమాటల్లో వెలువరిస్తూ. సుజాతకున్న విచిత్రమైన ఆశయం

మోహన్‌ని ఆలోచించేలా చేసింది. వారం తిరక్కుండానే సుజాతకు అత్తగారు ప్రత్యక్షమైంది.

ఆమని రాకతో పులకించిన భూమాతలా పులకించిపోయింది తను. అత్తాకోడళ్ళను చూస్తూ ఆనందిస్తున్నాడు మోహన్. తనకు తల్లివరసైన మీనాక్షమ్మ ఇంత దాకా దూరపు బంధువుల ఇంట్లో కాలం గడిపింది. ఇపుడు సుజాత ఆశయం నెరవేర్చటానికి తను తీసుకు వచ్చాడు. ఎంతో తృప్తి అనిపించింది. కాని ఆ తృప్తి ఎంతోకాలం నిలవలేదు. సుజాత ఆశయానికి, ఆచరణకి మధ్య ఎంతో వ్యత్యాసం కనిపించింది. ప్రతి చిన్న విషయానికి మీనాక్షమ్మతో వాదనకు దిగుతోంది సుజాత. ఎప్పుడూ చిరుబిరులాడటం, విసుక్కోవటం "సుజీ, అందరి లాగానే నువ్వుకూడా" అని మోహన్ ఏదో అనబోయేసరికి, భర్తమీద ఎక్కడలేని కోపంతో అపర సత్యభామలా అభినయించటం 'ఏమిటో ఈ సుజాత ఆశయం!' నిట్టూర్చాడు మోహన్. నెలకూడ తిరక్కుండానే ఓ సుప్రభాతాన సుజాత భర్తకు ఆజ్ఞ జారీ చేసింది. కాని అతడు నిశ్చేష్టుడైపోలేదు. అవాక్కయి ఆమె వేపు అయోమయంగా చూడనులేదు. సుజాత ఈ నిర్ణయానికి వస్తుందని ప్రసాద్ ఊహించకపోలేదు.

మీనాక్షమ్మ రాకముందు సుజాత సర్వస్వతంత్రురాలు. గృహరాజ్యాన్ని స్వేచ్ఛగా పాలించే రాణి. ఇపుడు ఇంట్లో అత్తగారుంది. ఆవిడ చెప్పినట్లుగా తను నడుచుకోవలసివచ్చేసరికి సహించ లేకపోయింది. తనకు బెడ్‌కాఫీ అలవాటు. మడీ ఆచారం లాంటివేమి గిట్టవు. స్టౌమీద కుక్కరు పడేసి ఇరుగుపొరుగులతో కబుర్లు చెప్పటంలోను, పత్రికా పఠనంతోనూ కూడా మునిగిపోయే సుజాత, సగం ఇంటిపని పనిపిల్లతో చేయించుకునేది.

"ఎంతసేపు పత్రికలు చదవడం, అమ్మలక్కలతో కబుర్లూ ఏమిటి? మనింటి పని మనం చేసుకోకపోతే ఎలా? మడీ ఆచారాలూ ఉండక్కర్లేదూ" అంటూ మడికట్టుకుని వంటసామాగ్రి అంతా తను అందిస్తుంటే వంటచేసే అత్తగారి ఉనికి సహించలేకపోయింది.

సుజాత ఆశయం మేరకు మీనాక్షమ్మ వెళ్ళిపోయింది. మళ్ళీ సుజాత ఇంటి వాతావరణం మామూలైపోయింది. కొంతకాలానికి తన ఆశయం మళ్ళీ స్మృతిపథంలో మెదిలింది. అది తనను హేళన చేసినట్లుగా అనిపించింది.

"ఇదేమిటి? తను మూర్ఖంగా ప్రవర్తించిందా? తన ఆశయాన్ని నెరవేర్చుకునే అవకాశాన్ని దూరం చేసుకుందా?" మనస్సు వేసిన ప్రశ్నకు సమాధానం కోసం అన్వేషిస్తోంది. 'తనెందుకు మీనాక్షమ్మతో కలిసి మెలిసి ఉండలేకపోయింది. తను అత్తగార్ని సంతోషపెట్టలేని కోడలైపోయిందా? ఏమో! తను చేసిన ప్రతిపని ఆవిడకు ఈసడింపుగానే తోచేది. తనైతే హాయిగా ఆడుతూ, పాడుతూ వంట చేసేసుకుని తనిష్టం వచ్చినట్లుగా సినిమాకో, షికారుకో వెళ్ళగలిగేది. బొత్తిగా ఆధునిక అలంకరణలు, ఆధునిక భావాలు ఏవీ గిట్టవు మీనాక్షమ్మకు. తను ఎలా కలిసి ఉండగలదు ఆవిడతో? తన భావాలు ఏవీ ఆవిడతో కలియలేదు. అభిరుచులూ అంతే. తనకు భర్తతోసహా, ఏ స్నేహితురాలుతోనో ఏ సినిమాకో వెళ్ళాలనిపించినపుడు పురాణానికో, ఏ కోవెలకో వెడతాననేది ఆవిడ. ఇంటికి తాళం వేసి ఎవరిదారిన వారు వెడదామంటే ఒప్పుకునేది కాదు.

వంటకాలు తయారుచేయడంలో ఆవిడది వ్యతిరేక ధోరణి. ఇన్ని లోపాలు ఆవిడలో ఉన్నపుడు తనని తను ఎందుకు అనుకోవాలి. కాస్త ఆవిడే సర్దుకోలేకపోయిందా? అసలిందులో తన తప్పేం లేదు.' అనుకుని సుజాత సగం ఊపిరిపీల్చుకుంది.

నిజమే. తను ఓటమిని అంగీకరించక్కర్లేదు. తన ఆశయం నెరవేరే అవకాశం లభించిందనుకోవటం పొరపాటు. ఆవిడేదో దూరపు బంధువే కాని సాక్షాత్తు తన భర్తకు కన్నతల్లికాదుగా. అలాంటిది తన అత్తగారెలా అవుతుంది. అందుకే తను ఓడిపోలేదు. నిజానికి తన శ్రీవారికి కన్నతల్లే ఉంటే ఆ అత్తగారితో పొరపొచ్చాలు ఉండేవి కావేమో. ఏమో ఏమిటి? తనకా అదృష్టమే ఉంటే అత్తగారు తనని మురిపాల కోడలా అంటూ పువ్వుల్లో పెట్టి చూసుకునేది. తనుకూడ బంగారు అత్తగారు అంటూ ఆవిడను కొలిచేది.' అలా తనని సమర్థించుకుని సుజాత నిండుగా ఊపిరిపీల్చుకుంది. ఆలోచనలు చెదిరిపోవాలని రేడియో ఆన్ చేసింది. 'అత్తలేని కోడలు ఉత్తమురాలు, కోడలు లేని అత్తగుణవంతురాలు' అంటూ పాట వినిపించేసరికి సుజాతకు కంపరమెత్తిపోయింది. ఆపాట తనకే వర్తిస్తుందేమో అనిపించింది. విసురుగా రేడియో కట్టేసి ఇక ఈసామెతను మనస్సులోకి చేరనివ్వకూడదనుకుంది.

ఊహకీ వాస్తవానికీ మధ్య ఎప్పుడూ ఎంతో కొంత వ్యత్యాసం ఉంటుందని సుజాతకి అప్పుడర్థమైంది.

●

(ఆకాశవాణి ద్వారా ప్రసారమైంది. 13-5-90)